రోల్ మోడల్‌గా తెలంగాణ జైళ్లు


ఎలక్ట్రానిక్ పరికరాలను అందజేస్తున్న వీవీ శ్రీనివాస్‌రావు, సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: తెలంగాణ రాష్ట్ర జైళ్ల పనితీరును ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారని, దేశంలోనే రోల్ మోడల్‌గా వాటిని తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పోలీస్ రిక్రూట్ మెంట్ చైర్మన్, పోలీసు అకాడమీ డైరెక్టర్ వీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. అపరేబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం (ఐసీజేఎస్) కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జైళ్లకు రూ. 2 కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలను అందజేశారు. శుక్రవారం చంచల్‌గూడలోని సీకా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆ శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రాతో కలిసి వివిధ జైళ్ల అధికారులకు కంప్యూటర్ సిస్టంలు, కెమెరాలు, ఎల్ఈడీ లైట్‌లు, వెబ్‌కెమెరాలు, వాకీటాకీలు, బాడీ వార్న్ కెమెరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటలైజేషన్ మొట్టమొదట పోలీసు శాఖలో ప్రారంభించామన్నారు. కోర్టులు, ఫోరెన్సిక్ ల్యాబ్‌లు, జైళ్లు, ప్రాసిక్యూషన్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు డిజిటలైజేషన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ డిజిటల్ రికార్డుల ద్వారా ఖైదీల కేసుల స్థితి, బెయిల్ విడుదల ఆదేశాలు, కోర్టు నిర్ణయాలు, పెరోల్, ఫర్లో వంటివి పొందుపరచవచ్చన్నారు. ఐసీజేఎస్ ప్రాజెక్ట్ ద్వారా జైళ్ల భద్రత, నిర్వహణతో పాటు ఖైదీల పునరావాసానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐజీ యెర్రంశెట్టి రాజేష్, డీఐజీలు డా. శ్రీనివాస్, సంపత్, సూపరింటెండెంట్‌లు నవాబు శివకుమార్‌గౌడ్, వెంకటలక్ష్మీ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


బీఆర్‌కే పార్కు సమస్యలపై మధుయాష్కీకి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

వనస్థలిపురం: రాజకీయాలు, గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ సమీపంలోని పార్కు, అభ్యుదయ నగర్ కాలనీలోని పార్కు, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద పార్కులను సందర్శించారు. ఈ సందర్భంగా వాకర్లను అడిగి ఆయా పార్కుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివేకానంద పార్కులో మూత్రశాలలు సరిగా లేవని, నూతనంగా నిర్మించిన టాయిలెట్లను వాడుకలోకి తేలేదని వాకర్స్ మధుయాష్కీగౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన హయత్‌నగర్ సర్కిల్ డీసీ యాదయ్య, ఏఎంహెచ్ఓ నీలిమతో మాట్లాడి నూతన టాయిలెట్లను వినియోగంలోకి తేవాలని, వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అభ్యుదయనగర్, పోలీస్‌స్టేషన్ సమీపంలోని పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, వాటిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం వనస్థలిపురం ఫేస్–2లోని బీఆర్‌కే పార్క్ స్థలాన్ని పరిశీలించారు. కొందరు ఆకతాయిలు పార్కులో మద్యం సేవిస్తున్నారని, తాము ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని స్థానిక మహిళలు మధుయాష్కీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన స్థానిక ఇన్‌స్పెక్టర్, ఏసీపీతో మాట్లాడి ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు సదాశివుడు, నరసింహా యాదవ్, అశోక్‌గౌడ్, రామారావు, సత్యనారాయణ, స్వర్ణమాధవి, విద్యారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, వినయ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారానికి చర్యలు


అటవీ శాఖ అధికారులతో మాట్లాడుతున్న అరవింద్‌రెడ్డి

ఎల్‌బీనగర్: సాహెబ్‌నగర్ కలాన్ సర్వేనంబర్ 201లో రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్‌కు లేఖ రాయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సాహెబ్‌నగర్ కలాన్ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి సైఫాబాద్‌లోని అరణ్యభవన్‌లో డీఎఫ్‌వో సుధాకర్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా అరవిందరెడ్డి మాట్లాడుతూ మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అటవీ శాఖ అధికారులు డీఎఫ్ఓ సుధాకర్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డిలతో మాట్లాడి సాహెబ్‌నగర్ కలాన్ భూమి స్వరూపాన్ని వివరించారన్నారు. సదరు భూమి అటవీ భూమి కాదని, గతంలో హుడా లేఅవుట్ కోసం 77 ఎకరాల భూమికి ఫారెస్ట్ కూడా ఎన్ఓసీ ఇవ్వడం జరిగిందని, అలాగే 118 జీవో కింద ఈ కాలనీ వాసులకు కన్వీనియన్స్ డీడ్‌లు ఇవ్వడం జరిగిందని అధికారులకు వివరించారన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే అన్ని విధా చర్యలు తీసుకుంటున్నారని ప్రజలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి, అమరేందర్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, పోగుల రాంబాబు, ప్రదీప్‌రెడ్డి, కొత్త భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం...మహాదానం



చంపాపేట: అన్ని దానాల్లో ఆకలిని తీర్చే అన్నదానమే మిన్న అని శ్రీమాతా అన్నపూర్ణేశ్వర అన్న ప్రసాద వితరణ ట్రస్ట్ చైర్మన్ దండేటికార్ భగవాన్‌జీ అన్నారు. శుక్రవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో చంపాపేట మూడు గుళ్ల ఆవరణలో నల్ల, ఎర్ర పోచమ్మ అమ్మ వారి ఆలయం ఎదుట 500 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భగవాన్‌జీ మాట్లాడుతూ...ప్రతీ అమావాస్య రోజు అన్న ప్రసాదాన్ని వితరణ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రవి ముదిరాజ్, ట్రస్ట్ సభ్యులు సుశీల్‌కుమార్, సంతోష్, ప్రవీణ్, ఘనసాల చింటు, రాజు, వెంకటేష్, రాజేష్, రమేష్, శ్రీను, మహేశ్వర్‌రెడ్డి, హరిలాల్ పాల్గొన్నారు.

శారదానగర్‌లో అగ్నిప్రమాదం

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్, శారదానగర్ కాలనీ సమీపంలోని గడ్డి పొలాల్లో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటించడంతో మంటలు వ్యాపించాయి. కాలనీ వాసుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై సమాచారం అందడంతో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సంఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరుగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


పరిస్థితిని సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చెత్త కుప్పలు కనిపించడం లేదా.?

పారిశుద్ధ్య పనుల నిర్వహణపై కార్పొరేటర్ లచ్చిరెడ్డి నిరసన



ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో చెత్తకుప్పలు పేరుకుపోయాయని వాటిని ఎప్పటికప్పుడు తొలగించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓస్ కాలనీలో చెత్త పేరుకుపోయినా అధికారులు తొలగించకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆయన బీజేపీ కార్యవర్గ సభ్యుడు వన్‌పల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎన్‌జీఓస్ కాలనీలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడంలేదని కాలనీ వాసులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ప్రతిరోజూ చెత్తను తొలగించాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘురాంనేత, శ్రీధర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, శరత్‌కుమార్, మహేశ్‌గౌడ్, పవన్‌రెడ్డి, ప్రభాకర్, మురళీ, విజయ్, కిశోర్, గౌరీశంకర్, సురేష్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ప్రేమ్ భాను, తదితరులు పాల్గొన్నారు.


జైపురి కాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన


వైజ్ఞానిక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన నమూనాలు

వినూత్నం..విభిన్నం..

- ఘనంగా సైన్స్‌డే వేడుకలు
- పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు
- ఆకట్టుకున్న ఎగ్జిబిట్లు
- సృజనాత్మకత చాటిన చిన్నారులు

సైన్స్ డే సందర్భంగా శుక్రవారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు రూపొందించిన ప్రదర్శనాంశాలు ఆహూతులను అలరించాయి. విభిన్న, వినూత్నమైన అంశాలను ప్రదర్శించి ఔరా అనిపించుకున్నారు. –ఎల్‌బీనగర్, మలక్‌పేట్ జోన్ బృందం


తాము రూపొందించిన నమూనాతో భాష్యం విద్యార్థులు


శ్రీ ఆదిత్య పాఠశాలలో...


మన్సూరాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో


నారాయణ పాఠశాలలో సైన్స్‌ఫేర్‌ను తిలకిస్తున్న అతిథులు


వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

డిజిటల్ ధరల బోర్డు ఏర్పాటు



చాదర్‌ఘాట్: రైతుల సౌకర్యార్థం మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో డిజిటల్ ప్రైస్ బోర్డు ఏర్పాటు చేసినట్లు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ దామోదర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిజిటల్ ప్రైస్ బోర్డు ఏర్పాటు వల్ల మార్కెట్ ధరలే కాకుండా రాష్ట్రంలోని వివిధ జిల్లాలలోని సరుకుల ధరలపై కూడా రైతులకు అవగాహన వస్తుందన్నారు. దీనిని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

సమష్టి కృషితోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న సుప్రీంకోర్టు న్యాయవాది జగన్‌గౌడ్

హస్తినాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచి పెద్ద చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ జగన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్‌కాలనీ సంక్షేమ సంఘం భవనం ప్రాంగణంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ యాదవ్‌తో పాటు పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మూగజీవాల దాహాన్ని తీరుద్దాం


తొట్టిలో నీటిని పోస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి

మన్సూరాబాద్: వేసవిని దృష్టిలో ఉంచుకుని మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఎదుట నీటిని ఏర్పాటు చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. శుక్రవారం కాస్మోపాలిటన్‌కాలనీలో కాలనీవాసులకు మూగ జీవాలకు నీటిని అందించే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలవాసులు నీటిని వృథా చేయరాదని, మూగ జీవాలు తాగేందుకు వీలుగా ఇంటి బయట టబ్‌లను ఏర్పాటు చేసి నీటితో నింపాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వెటర్నరీ సిబ్బంది, కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి



మన్సూరాబాద్: ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మన్సూరాబాద్ డివిజన్, చిత్రసీమ కాలనీ బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వసతి గృహంలోని సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు పరీక్షలపై శ్రద్ధ పెట్టాలని, మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కొప్పుల విఠల్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీష్ యాదవ్, నాగరాజు, రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతులకు దాతల చేయూత


ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ సందీప్ పట్నాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చంపాపేట: చంపాపేట డివిజన్ రోషన్‌దౌలా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దాతలు సంతోష్‌నగర్ ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ సందీప్ పట్నాయక్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంక్, వాటర్ ఫిల్టర్, తాగునీటి సంపు తదితర సదుపాయాలు కల్పించటం హర్షణీయమని సరూర్‌నగర్ ఎంఈఓ బాసూనాయక్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సందీప్ పట్నాయక్‌తో కలిసి వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సందీప్‌ను శాలువలు, పూలబొకేలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు అహ్మద్‌బాబా, శాంత, భాగ్య, మేఘమాల, రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


ఎంపీ ఈటలను సన్మానిస్తున్న పంగ శ్రీకాంత్

నాగోలు: కార్యకర్తలు, నాయకులు భారతీయ జనతాపార్టీ బలోపేతానికి కృషి చేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. ఇటీవల నాగోలు డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన పంగ శ్రీకాంత్ శుక్రవారం మర్యాద పూర్వకంగా ఎంపీని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ నాగోలు డివిజన్ బీజేపీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని ఎంపీని కోరినట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చాదర్‌ఘాట్: ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలని అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి అన్నారు. శుక్రవారం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు నివసించే ప్రాంతాల్లో వారి హక్కులు, ఇబ్బందులపై చర్చించనున్నట్లు తెలిపారు. పోలీసులు అట్రాసిటీ కేసులు పోలీసులు నమోదు చేయక పోతే నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ అధికారి మోహన్ మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా పేదలకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో చాదర్‌ఘాట్ ఎస్ఐ శ్రీనివాస్, కాలనీవాసులు బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయి

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: మరమ్మతు పనుల కారణంగా శనివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉ 11 గంటల నుంచి 11:30 వరకు...
లక్ష్మీనగర్, ఇంద్రప్రస్థ కాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, పద్మావతీ కాలేజ్, సంగం లక్ష్మీబాయి కాలేజ్ పరిసర ప్రాంతాలు.

ఉ 11:30 నుంచి మ.12 గంటల వరకు...
క్యాపిటల్ హోటల్, ఆస్మాన్‌ఘడ్, సేఫ్ హాస్పిటల్, బీకే ఫంక్షన్ హాల్ బ్యాక్ సైడ్, ఆంధ్రా బ్యాంక్ కాలనీ.

మ.1:30 నుంచి 2 గంటల వరకు...
దిల్‌కుషా ఫంక్షన్‌హాల్, ఫైర్ స్టేషన్, ఆఫీసర్స్ మెస్, ఆర్యసమాజ్, అమీర్ ఫాతీమా మాస్క్, రామాలయం టెంపుల్, అక్బర్‌బాగ్ క్రాస్ రోడ్, దయానంద్ నగర్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఆయన వివరించారు.

కులగణన సర్వే పూర్తి


చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6లో కులగణన సర్వే శుక్రవారం నాటికి పూర్తయ్యిందని సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. ఈనెల 16 నుంచి 28 వరకు జరిగిన సర్వేలో ఆన్‌లైన్ ద్వారా 151 దరఖాస్తులు వచ్చాయని ఆఫ్‌లైన్‌లో 272 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. 423 కుటుంబాలు సర్వే చేయించుకున్నట్లు ఆయన వివరించారు.

చాదర్‌ఘాట్ డీఐ బదిలీ

చాదర్‌ఘాట్: సాధారణ బదిలీల్లో భాగంగా చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో డీఐగా పనిచేస్తున్న సైదులు బోరబండ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బోరబండలో డీఐగా పని చేస్తున్న భూపాల్‌గౌడ్‌ను చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.19, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.21, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.23, సొరకాయ రూ09, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.45, మునగ రూ.60, కందగడ్డ రూ.60, బీట్‌రూట్ రూ.19, కీర రూ.23, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.



కాలనీ సమస్యలను పరిష్కరించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రాక్‌టౌన్ కాలనీ వాసులు

మన్సూరాబాద్: కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నాగోలు డివిజన్ పరిధి రాక్‌టౌన్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రవినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు శుక్రవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలను పరిష్కరించి కాలనీని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జైపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షుడు పాల్వాయి రాంరెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలో రూ.27లక్షలతో చేపట్టిన రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, కోశాధికారి రవీందర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు మల్లారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పుష్పాల్‌రెడ్డి, హనుమంతరెడ్డి, కృష్ణారెడ్డి, రాధాక్రిష్ణ, లక్ష్మీనారాయణ, నాయకులు ముత్యాలు , విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పవన్‌కుమార్, సురేష్‌కుమార్, జవాన్ యాదయ్య, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఏర్పాటు


నూతన కార్యవర్గ సభ్యులు

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని లక్ష్మీ నరసింహ స్వామి ఫేస్ 2 కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా విజయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మురళి, కోశాధికారిగా సుధాకర్, ఉపాధ్యక్షులుగా కాశీరాం, సురేందర్ రావు, సహాయ కార్యదర్శిగా శ్రీపతిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శిరీష, కార్యవర్గ సభ్యులుగా వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నటరాజ్ తదితరులు ఎన్నికయ్యారు.